క్లుప్తంగా

సంతోషంగా దసరా జరుపుకోండి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి నియోజక వర్గ ప్రజలు గురువారం దసరా పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆయన నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

విజయాలు చేకూరాలి


సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రజలు సుఖసంతోషలతో తులతూగాలని అన్నింటా విజయాలు చేకూరాలని కోరుకుంటూ సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో జీవించాలని కోరారు.

స్థలం కేటాయించాలని వినతి

చిల్లకూరు: మండలంలోని దళితవాడ వాసులు మృతి చెందితే ఖననం చేసుకునేందుకు సమీపంలో ఉన్న 30 సెంట్ల స్థలాన్ని మరు భూమికి కేటాయించాలని తిప్పగుంటపాళెం దళితులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులకు విన్నవించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మరుభూమికి స్థలం చూపించాలని వీఆర్‌ఓ విద్యావతికి సూచించారు.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం : మద్యం మత్తులో బైక్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, నాయుడుపేట పట్టణ ప్రాంతానికి చెందిన శీనయ్య, రియాజ్ పూటుగా మద్యం తాగి నాయుడుపేట నుంచి సూళ్లూరుపేటకు బైక్ మీద బయలుదేరారు. మద్యం మత్తులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడగా హైవే మొబైల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని స్వర్ణా టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు



వెంకటగిరి : వృద్ధుల పడిగాపులు, నాయుడుపేట: సచివాలయ మెట్లు ఎక్కలేక అవస్థలు పడుతున్న పింఛన్ దారులు

వెంకటగిరి రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పింఛనుదారులకు అగచాట్లు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో ఒకటోతేదీ తెల్లారకముందే ఇంటి వద్దే పింఛన్లు అందుకునే వృద్ధులు ఇప్పుడు సచివాలయాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటల తరువాత పింఛన్లు పంపిణీ ప్రారంభించడంతో పట్టణ పరిధిలోని పింఛనుదారులు అయోమయానికి గురయ్యారు. దీంతో సచివాలయం వద్దకు వెళ్లి నిరీక్షించారు. అయితే ఎట్టకేలకు పింఛన్ దారులకు ఆలస్యంగా పింఛన్‌లను పంపిణీ చేశారు.

తప్పని అవస్థలు


నాయుడుపేటటౌన్ : సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం అదనపు భారం వేస్తోందంటూ వారు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. పలు సచివాలయాల్లో ఉదయం 10 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద బారులు తీరారు. గంటల తరబడి అవస్థలు పడి పింఛన్లు తీసుకున్నారు. పట్టణంలోని మిద్దెలపై ఉన్న సచివాలయాల వద్ద మెట్లు ఎక్కేందుకు నానా అవస్థలు పడ్డారు.

పింఛన్ల పంపిణీలో ఆలస్యం

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో బుధవారం ఆలస్యంగా పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. దీంతో పింఛనుదారులు ఎక్కడికక్కడ గుంపులు గుంపులుగా కూర్చుని ఎదురుచూడాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ఎంపీడీఓలు స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో మధ్యాహ్నం 12 గంటల తరువాత పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పండుగ రోజు కూడా తమకు కష్టాలు తప్పడం లేదని అవ్వాతాతలు వాపోయారు.


నాయుడుపేట: మహిషాసుర మర్దినిగా దుర్గా మల్లేశ్వరి దేవి


చిట్టమూరు: మహిషాసుర మర్దినిగా కామాక్షమ్మ


సైదాపురం: కాళికామాతగా బాల త్రిపురసుందరీదేవి


వెంకటగిరి : మహిషాసుర మర్దినిగా రేణుక మారెమ్మ


రాపూరు: మహిషాసుర మర్దినిగా అంకమ్మ


చిల్లకూరు: మహిషాసుర మర్దినిగా ముత్యాలమ్మ


సూళ్లూరుపేట: రాజరాజేశ్వరిగా చెంగాళమ్మ పరమేశ్వరి

రాక్షస సంహారి మహిషాసురమర్దిని

దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు కనులపండువగా సాగుతున్నాయి. అందులోభాగంగా బుధవారం రాత్రి అమ్మవారు రాక్షసుడిని సంహరంచే మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. -సాక్షి నెట్‌వర్క్

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన కామిరెడ్డి


ఎంపీ మిథున్‌రెడ్డితో కామిరెడ్డి, కిలివేటి తదితరులు

పెళ్లకూరు: రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అక్రమ కేసు విషయంలో బెయిల్ పై విడుదలైన మిథున్‌రెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, బైనా మల్లకార్జున్‌రెడ్డి ఉన్నారు.

కమిటీల బలోపేతానికి ప్రణాళికలు


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న గ్రామా ల్లో వైఎస్సార్ సీపీ క్షేత్ర స్థాయి కమిటీలను సిద్ధం చేసేందుకు ప్రణాళికలను చేస్తున్నామని గూడూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం పలువురు నాయకులతో కమిటీలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు చొరవ చూపాలని అన్నారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ బొమ్మిడి శ్రీనివాసులు, మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు నందవరం సుబ్బారావు. పూర్ణచంద్ర, సనత్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మార్క్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ పోస్టర్ల ఆవిష్కరణ

సూళ్లూరుపేట/సైదాపురం/కోట/నాయుడుపేట టౌన్ : రక్షణగా నిలిచే డిజిటల్ బుక్‌ను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వినియోగించుకోవాలని మండల పార్టీ అధ్యక్షులు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. సూళ్లూరుపేట పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటల్ యాప్‌ను ప్లేస్టోర్‌కెళ్లి డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమపై దాడి చేసిన కూటమి నాయకులు, అధికారుల పేర్ల మీద ఫిర్యాదులను నమోదు చేయాలని కోరారు. అనంతరం డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. బాలాయపల్లి మండలం కొత్తపాళెంలో మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను ప్రారంభించారు. కోట మండలంలో పార్టీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, నాయుడుపేట వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో మండల కన్వీనర్ ఓట్టురు కిషోర్ యాదవ్‌తోపాటు, జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరించారు.

రాజావారి కోటలో ఆయుధపూజ


హారతి తీసుకుంటున్న యువరాజాలు

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో బుధవారం రాజా వారసులచే ప్రత్యేకంగా ఆయుధ పూజను నిర్వహించారు. వెంకటగిరి సంస్థానం పెద్ద రాజా గారైన వివివి ఆర్‌కే యాచేంద్ర మునిమనవడు, ప్రస్తుత రాజా సర్వజ్ఞ కుమారకృష్ణ యాచేంద్ర కుమారుడు 34 వతరం యువరాజు వెలుగోటి వెంకట సాయి సమర్థ రాజగోపాలకృష్ణ యాచేంద్రచే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటగిరి గ్రామ దేవత శ్రీకలివేలమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: ఐసీడీఎస్ వెంకటగిరి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శంషాద్‌బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ పరిధిలోని వెంకటగిరి మండలం యాతలూరు-2, తిమ్మాయిగుంట, పాతకోట, పూజారివీధి, డక్కిలి మండల పరిధిలో డీ వడ్డిపల్లి, బాలాయపల్లి మండల పరిధిలో పిగిలాం-1, బొల్లవారిపాళెం ప్రాంతాల్లో మొత్తం 7 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిల్లకూరు: మూడు నెలల పాటు నిర్వహించే కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సునీతా సేవా సంస్థ ప్రతినిదులు తెలిపారు. గూడూరు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న సునీతా సేవా సంస్థ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏదైనా వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ తీసుకుని ఉపాధికి మార్గం చూపడమే తమ సంస్థ లక్ష్యమని అన్నారు. దరఖాస్తుల కోసం సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువత

గూడూరురూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. నేషనల్ వలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా బుధవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది రక్తదానంపై పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మెడిప్లస్ బ్లడ్ సెంటర్‌లో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

వృద్ధాశ్రమానికి దాతల చేయూత

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఓజిలి మండల అత్తివరం గ్రామానికి చెందిన పాలచ్చారు అమరేంద్ర యాదవ్ బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేశారు.

రొట్టెలు, బిస్కెట్ల పంపిణీ

గూడూరురూరల్ : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు రొట్టెలు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.